
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
బుధవారం 19 జూన్ 2024



గ్రామాల్లో జ్వరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు 8లో..

హత్యాచారానికి గురైన చిన్నారికి నివాళి 8లో..

మార్కెట్ కమిటీలపై నజర్



- పదవులపై కాంగ్రెస్ నాయకుల ఆశలు
- మంత్రి, ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు
- నెలరోజుల్లో భర్తీచేసే యోచనలో ప్రభుత్వం

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పార్లమెంట్ ఎన్నికలు ముగియడంతో నెల రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మార్కెట్ కమిటీలకు నూతన పాలక వర్గాలను నియమించాలనే యోచనలో ప్రభుత్వం ఉంది. దీంతో అధికార కాంగ్రెస్ పార్టీ నాయకుల నజర్ మార్కెట్ కమిటీలపై పడింది. ఆ పోస్టులను దక్కించుకునేందుకు నాయకులంతా మంత్రి, ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో అమలుచేసిన విధంగానే ఇప్పుడు కూడా రిజర్వేషన్ల ప్రకారమే పదవులను కట్టబెట్టేందుకు ప్రభుత్వం మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. పార్టీ నాయకులు సైతం రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో మార్కెట్ కమిటీ చైర్మన్లను రిజర్వేషన్ ప్రాతిపదికన నియమించారు. ప్రతి రెండేళ్లకోసారి రొటేషన్ పద్ధతిన పదవులను కట్టబెడుతున్నారు. పదేళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రిజర్వేషన్లను కొనసాగిస్తుందా, ఆ విధానాన్ని ఎత్తివేస్తుందా అనే విషయమై రాజకీయ వర్గాల్లో చర్చ జరిగింది. రిజర్వేషన్లు ఎత్తివేస్తే పోటీదారులు ఎక్కువ అవుతారని భావిస్తున్న ప్రభుత్వం రిజర్వేషన్ల విధానాన్ని కొనసాగించాలని ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. ఆ మేరకు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలకు సిగ్నల్స్ వచ్చినట్లు ప్రచారం జరుగుతున్నది. దీంతో జిల్లాలో ఉన్న 8 మార్కెట్ కమిటీలపై కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు చింతకుంట విజయరమణారావు, రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ చుట్టూ తిరుగుతున్నారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత అధికారంలోకి వచ్చిన ఉద్యమ బీఆర్ఎస్ పార్టీ మార్కెట్ కమిటీల నియామకాలకు సంబంధించి నూతన విధానాలను తీసుకవచ్చింది. అంతకుముందు ఎలాంటి రిజర్వేషన్లు లేకుండా చైర్మన్లను నియమించే వాళ్లు. బీఆర్ఎస్ ప్రభుత్వం చైర్మన్ల నియామకాలకు సంబంధించి రిజర్వేషన్ల విధానాన్ని తీసుక వచ్చింది. పురుషులు, మహిళలకు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ, ఓసీలకు రొటేషన్ విధానాన్ని అమలుచేయాలని జీవో జారీ చేసింది. మార్కెట్ కమిటీల పదవీకాలం మొదట ఏడాది మాత్రమే ఉండగా, ఆ తర్వాత రెండేళ్ల క్రితం రెండేళ్లకు పెంచడం గమనార్హం. పదవీ కాలం ఏడాది ఉన్న వాళ్లకు మాత్రం ఆరు నెలల చొప్పున పదవీ కాలాన్ని రెండు, రెండున్నర సంవత్సరాల పాటు పొడిగించిన సందర్భాలు కూడా ఉన్నాయి.

రిజర్వేషన్ల ప్రాతిపదికనే నియామకాలు..

గత ఏడాది నవంబర్ నెలాఖరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మెజారిటీ సీట్లు సాధించి ప్రభుత్వం చేపట్టింది. అప్పటివరకు ఉన్న మార్కెట్ కమిటీలన్నింటినీ రద్దు చేసింది. పదవీ కాలం ఉన్న కొన్ని మార్కెట్ల చైర్మన్లు కోర్టును కూడా ఆశ్రయించారు. వారికి అనుకూలంగా కోర్టు తీర్పు రాకపోవడంతో అన్నింటినీ మార్చి నెలలో రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రంలో ఉన్న దాదాపు 132 మార్కెట్ కమిటీలకు నామినేటెడ్ ప్రాతిపదికన చైర్మన్, డైరెక్టర్లను నియమించాల్సి ఉంది. ఈ పదవులపై అనేక మంది కాంగ్రెస్ పార్టీకి చెందిన ద్వితీయ శ్రేణి నాయకులు ఆశలు పెంచుకున్నారు. జిల్లాలో పెద్దపల్లి, సుల్తానాబాద్, జూలపల్లి, కాల్వశ్రీరాంపూర్, ధర్మారం, మంథని, కమాన్‌పూర్, రామగుండంలో మార్కెట్‌లు ఉన్నాయి. వీటికి నూతన పాలక వర్గాలను నియమించాల్సి ఉంది. ఇప్పటి వరకు ఆయా మార్కెట్లకు అమలు చేసిన రిజర్వేషన్లు పోనూ పాత విధానం ప్రకారం అయితే పెద్దపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఎస్సీ సామాజిక వర్గానికి, సుల్తానాబాద్ కమిటీ చైర్మన్ పదవి జనరల్ కేటగిరీకి, జూలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి బీసీ సామాజిక వర్గానికి, కాల్వశ్రీరాంపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి జనరల్‌కు, ధర్మారం మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఎస్టీలకు, మంథని మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి జనరల్‌కు, కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి జనరల్‌కు, రామగుండం మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారికి కేటాయించారు. రిజర్వేషన్లను అమలుచేస్తే మాత్రం ఆయా కేటగిరీలకు చెందిన వాళ్లకే చైర్మన్ పదవులు దక్కనున్నాయి. రిజర్వేషన్ల ప్రకారమే మార్కెట్ పదవులను కట్టబెట్టాలనే డిమాండ్ పార్టీ వర్గాల నుంచి వినిపిస్తున్నది. రిజర్వేషన్లు ఎత్తేస్తే మాత్రం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్యాయం జరుగుతుందని, మహిళలకు మొత్తానికి అవకాశం దక్కదని అభిప్రాయ పడుతున్నారు. ప్రభుత్వం కూడా రిజర్వేషన్ల ప్రాతిపదికనే కమిటీలను నియమిస్తే తమకు తలపోటు ఉండదని భావిస్తున్నది. పార్లమెంట్ ఎన్నికల కోడ్ ఈనెల 6వ తేదీ నుంచి ముగియడంతో ఆశావహులు మార్కెట్ పదవులను దక్కించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికే పదవులను కట్టబెట్టాలని పార్టీ నాయకులు కోరుతున్నారు.

సీఐలుగా పదోన్నతులు కల్పించాలి

- మంత్రి పొన్నంకు ఎస్ఐల వినతి



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్సైలు

పెద్దపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పాత ఐదవ జోన్‌లో మిగిలిపోయిన తమకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతి కల్పించాలని కోరుతూ 2012 బ్యాచ్‌కు చెందిన ఎస్ఐలు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేశారు. మంగళవారం ఎస్ఐలు ప్రమోద్‌రెడ్డి, విజేందర్, శ్రీనివాసరావు, నరేష్ సాంబమూర్తి, ప్రసాద్ హైదరాబాద్‌లో మంత్రిని కలిసి తమ ఆవేదనను వ్యక్తం చేశారు. తాము 2012లో పాత వరంగల్ జోన్-5లో 146 మంది ఎస్ఐలుగా నియామకం అయ్యామని పేర్కొన్నారు. ఆరేళ్ల సర్వీస్ అనంతరం సీఐలుగా పదోన్నతి పొందేందుకు అర్హులమని, కానీ పదకొండేళ్లుగా ఎస్ఐలుగానే కొనసాగుతున్నామని పేర్కొన్నారు. పాత వరంగల్ జోన్ 5 ప్రకారం తమ బ్యాచ్‌కు చెందిన 42 మంది ఎస్ఐలుగా పదోన్నతి పొందారన్నారు. గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జీవో 317 ప్రకారం జోనల్ వ్యవస్థలో మార్పులు తీసుకవచ్చి కొత్త జోన్‌లను ఏర్పాటు చేసిందని, పాత జోన్లలో ఉన్న రెండు జోన్లను మల్టీ జోన్ 1, మల్టిజోన్ 2గా మార్చారని, తమ జోన్‌లోకి ఇతర జోన్ల నుంచి 66 మంది ఎస్ఐలు తమ జాబితాలో చేరిపోయారని పేర్కొన్నారు. తమకు రావాల్సిన పదోన్నతులు వారికి దక్కాయన్నారు. తమ బ్యాచ్‌కు చెందిన ఎస్ఐలు సీఐలుగా పదోన్నతి పొంది నాలుగేళ్లు గడిచిందని వివరించారు. తమ బ్యాచ్‌కు చెందిన వారందరికీ ప్రభుత్వం పదోన్నతులు కల్పించే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుక వెళ్లాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి ఈ విషయమై సీఎం దృష్టికి తీసుకవెళ్తామని చెప్పారని ఎస్ఐలు కోరారు.

కేశోరాం కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఎన్నికల్లో

కౌశిక హరి ప్యానల్ విజయం



సంబరాలు జరుపుకుంటున్న కౌశిక హరి, మాదాసు శ్రీనివాస్ తదితరులు

పాలకుర్తి, జూన్ 18: బసంత్‌నగర్ కేశోరాం సిమెంటు కంపెనిలో మంగళవారం జరిగిన కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగిరింది.అత్యంత ఉత్కంఠ భరితంగా జరిగిన పోరులో విజయం బీఆర్ఎస్‌ను వరించింది.అధికార కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి పరాజయం పాలయ్యాడు.గెలిచిన బీఆర్ఎస్ శ్రేణులు విజయోత్సవ సంభరాల్లో మునిగి తేలారు. బీఆర్ఎస్ నాయకుడు కౌశిక హరి ప్యానల్ ప్రధానకార్యదర్శి అభ్యర్థి మాదాసు శ్రీనివాస్ ఘన విజయం సాధించారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు బయ్యపు మనోహర్‌రెడ్డి బలపరిచిన ప్రధాన కార్యదర్శి అభ్యర్థి నగునూరి రమేష్‌పై మాదాసు శ్రీనివాస్ 66 ఓట్ల తేడాతో విజయం సాధించారు. మొత్తం 809 ఓట్లకు 787 ఓట్లు పోలాయ్యాయి. కౌశిక హరి ప్యానల్‌కు 418, మనోహర్‌రెడ్డి ప్యానల్‌కు 352 ఓట్లు లభించాయి. ధర్మచక్రం గుర్తు అభ్యర్థి పొనవేని సదయ్యకు ఒక ఓటు, చేతిలో చెయ్యి గుర్తు అభ్యర్థి కాల్వ నరేష్‌కు 9, చెల్లని ఓట్లు 9, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 9 పోలయ్యాయి.

కార్మికులను కష్టసుఖాల్లో పాలుపంచుకుంటాం..

తమ ప్యానల్‌ను అత్యంత నమ్మకంతో గెలిపించిన కార్మికుల కష్టసుఖాల్లో పాలు పంచుకుంటామని, ఈ విజయం కార్మికులందరి విజయంగా భావిస్తామని నూతనంగా గెలిచిన అధ్యక్షుడు కౌశిక హరి, ప్రధానకార్యదర్శి మాదాసు శ్రీనివాస్ లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, అభిమానులు, నాయకులు, కార్యకర్తలు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పోలింగ్ కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ ఆధ్వర్యంలో సీఐలు కృష్ణ, సుబ్బారెడ్డి, బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి, శివాణిరెడ్డిలతో పాటు పలువురు పోలీసులు బందోబస్తు చేపట్టారు. ఎన్నికల అధికారి బద్దం డానియల్, కేశోరాం మేనేజర్ పి ప్రార్థసారథి, కర్ణకంటి సదానందం తదితరులు పాల్గొన్నారు.

బూడిద చోరీ కేసులో నలుగురి అరెస్టు

జ్యోతినగర్, జూన్ 18: ఎన్టీపీసీ క్రషర్‌నగర్‌లోని యాష్‌పాండ్ బూడిదను ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తూ అమ్ముకుంటున్న నలుగురిని ఎన్టీపీసీ పోలీసులు పట్టుకున్నట్లు గోదావరిఖని ఏసీపీ రమేష్ తెలిపారు. తరచుగా బూడిదను చోరీ చేస్తున్న సందర్భంలో టీజీ జెన్కో ఈఈ నాగభూషణం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో ఎస్ఐ ఉదయ కిరణ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తుండగా ఎడ్ల సాయి, అడిచెర్ల శ్రావణ్, లారీ డ్రైవర్ సొదాగర్, రామ్ జనంచౌహాన్‌లను నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఎక్స్‌కవేటర్, కారు, రెండు లారీలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఏసీపీ వివరించారు.

జాతీయ ఉపకార వేతన ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత



అలేఖ్యను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

ధర్మారం (జూలపల్లి), జూన్ 18:జాతీయ ఉపకార వేతన(ఎన్ఎంఎంఎస్) ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ధర్మారం మండలం కొత్తూరు గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదవ తరగతి విద్యార్థిని కోడూరు అలేఖ్య ఉత్తీర్ణత సాధించింది. ఈ సందర్భంగా అలేఖ్యను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యం ఆధ్వర్యంలో అభినందించారు ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థినికి ప్రతి సంవత్సరం 12 వేల రూపాయలు బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. నాలుగు సంవత్సరాల పాటు 12వేల చొప్పున నగదు ప్రోత్సాహం ప్రభుత్వం తరపున అందుతుందని వివరించారు. ప్రభుత్వ విద్యాలయాల్లో చదివే వారికి మాత్రమే ఈ అవకాశం ఉంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో అలేఖ్య తండ్రి కోడూరు చంద్రమౌళి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

బదిలీపై వెళుతున్న కలెక్టర్‌కు ఘనంగా వీడ్కోలు

పెద్దపల్లిటౌన్, జూన్ 18: బదిలీపై వెళుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు కొత్తగా వచ్చిన కలెక్టర్ కోయ శ్రీహర్ష, పలువురు అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఖమ్మం కలెక్టర్‌గా బదిలీపై వెళ్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు ఆత్మీయ వీడ్కోలు, జిల్లాకు కలెక్టర్‌గా వచ్చిన కోయ శ్రీహర్షకు స్వాగత కార్యక్రమాన్ని జిల్లా అధికారుల బృందం నిర్వహించారు. కలెక్టర్‌గా వెళ్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజాభివృద్ధి, సంక్షేమం అంశాల్లో జిల్లా ముందుండాలని ఆకాంక్షించారు. ఉద్యోగి జీవితంలో బదిలీలు సహజమని, మనకు అందుబాటులో ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. జిల్లాలో ప్రతిశాఖ అధికారులు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించారని అన్నారు. గత 11నెలల కాలం చాలా మంచిగా గడిచిందని, ప్రభుత్వ లక్ష్యాలను పూర్తిచేయడంలో, ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను అమలుచేయడంలో తనకు స్థానిక ప్రజాప్రతినిధులు, అదనపు కలెక్టర్‌లు, ఆర్డీవోలు, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, ప్రభుత్వ అధికారులు, సిబ్బంది పూర్తిస్థాయిలో సహకరించారన్నారు. విద్యా వ్యవస్థలో మంచి మార్పులు తీసుకొని వచ్చే దిశగా లంచ్ అండ్ లెర్న్ బుధవారం, సమ్మర్ క్యాంప్ నిర్వహణ, రీడింగ్ రూమ్‌ల ఏర్పాటు వంటి వినూత్న కార్యక్రమాలను జిల్లాలో అధికారులు, సిబ్బంది కృషితో అమలు చేశామని తెలిపారు.



బదిలీ అయిన కలెక్టర్‌ను సన్మానిస్తున్న కలెక్టర్, అధికారులు

ఉద్యోగులు ప్రభుత్వ విధులను పకడ్బందీగా నిర్వహించడంతో పాటు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, ప్రతి రోజూ కొంత సమయం నడవాలని సూచించారు. ప్రతి ఉద్యోగి ప్రభుత్వ విధులతో పాటు తన కుటుంబానికి సమయం కేటాయించాలన్నారు. నూతన కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జిల్లాలో గత 11నెలల కాలంలో ముజమ్మిల్‌ఖాన్ విశేషమైన సేవలు అందిం చారని, ఖమ్మం జిల్లాలో సైతం మంచి సేవలు అందించాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో అధికారులు స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో జిల్లాను మరింత అభివృద్ధి సాధించే దిశగా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారులు బి.గంగయ్య, హనుమా నాయక్, జిల్లా అధికారులు డీఎంవో ప్రవీణ్‌రెడ్డి, డీఏవో ఆదిరెడ్డి, డీఈవో మాధవి, డీఎస్‌వో ప్రేమ్‌కుమార్, డీసీవో శ్రీమాల, డీపీఆర్‌వో అయూబ్‌ఖాన్, బీసీ సంక్షేమ శాఖ అధికారి రంగారెడ్డి, డీఆర్‌డీవో అధికారి రవీందర్, సీపీవో రవీందర్, డీఎం సివిల్ సప్లై మేనేజర్ శ్రీకాంత్, జడ్పీ సీఈవో నరేందర్, డీడబ్ల్యూవో రవూఫ్‌ఖాన్, నాగైలేశ్వర్, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం నాయకుడు తూము రవీందర్, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ ఉత్సవాలు

కమాన్‌పూర్, జూన్ 18 : మండలంలోని జూలపల్లి గ్రామంలోని మల్లికార్జున నగర్‌లోని ముదిరాజ్ కులస్థుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మంగళవారం ముదిరాజ్ కులస్థులు ఇంటింటా తిరుగుతూ జోగు కార్యక్రమం నిర్వహించారు

పోలీస్ అధికారులు బాధ్యతగా పని చేయాలి

- సమగ్ర విచారణతో నేరస్తులకు శిక్ష పడే విధంగా చూడాలి - బాధితుల ఫిర్యాదులకు వెంటనే స్పందించాలి
- సమీక్ష సమావేశంలో రామగుండం సీపీ శ్రీనివాస్




సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, జూన్ 18: సమగ్ర విచారణతో నేరస్తులకు కోర్టుల్లో శిక్ష పడేలా పోలీస్ అధికారులు బాధ్యత పని చేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ మంచిర్యాల జోన్ పరిధిలోని అధికారులకు సూచించారు. మంగళవారం కమిషనరేట్‌లో మంచిర్యాల జోన్ పరిధిలోని డీసీపీ, ఏసీపీలు, సీఐ, పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోలతో అండర్‌ఇన్వెస్టింగ్ కేసులు, గ్రేవ్ అండర్ ఇన్వెస్టింగ్ లాంగ్ పెండింగ్‌లో కేసుల పరిష్కారం, ఎస్సీ, ఎస్టీ, ఉమెన్ ఎగైనెస్ట్, పోక్సో కేసుల పరిష్కారం, ఎన్‌డీపీఎస్ యాక్ట్, ఎన్‌హెచ్‌ఆర్‌సీ, ఎస్‌హెచ్‌ఆర్‌సీ, మహిళా కమిషన్‌కు సంబంధించిన అప్పీల్ పిటిషన్ పెండింగ్‌పై సీపీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న కేసులను త్వరగా డిస్పోజల్ చేయాలన్నారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేయాలన్నారు. ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్‌తో పాటు పూర్తి పారదర్శకంగా కేసును ఇన్వెస్టిగేషన్ చేయాలన్నారు. ప్రతి సీడీ ఫైల్‌ను, అందులో ఉన్న డాక్యుమెంట్స్‌ను పరిశీలించి కోర్టులో చార్జిషీట్ దాఖలుచేయాలని, పెండింగ్ ఉన్న సీసీ నెంబర్లు తీసుకోవాలన్నారు. ప్రతి ఫైల్‌లో ప్లాన్ ఆఫ్ యాక్షన్ ప్రకారం సీడీ ఫైల్ పొందుపరచాలని, నేర చేదన కంటే, నేర నివారణ ముఖ్యమని తెలిపారు. సమన్స్, వారంట్స్ ఎగ్జిక్యూటివ్ చేయాలని, క్రైమ్‌అగైనెస్ట్ ఉమెన్ కేసుల్లో త్వరగా ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని, ప్రోయాక్టివ్ పోలీసింగ్‌పై అధికారులు సిబ్బంది దృష్టిసారించాలని సూచించారు. బాధతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితుల పిటిషన్‌లకు వెంటనే స్పందించాలని, సామన్య ప్రజలకు చట్టపరిధిలో న్యాయం జరుగుతుందని నమ్మకం, భరోసా కలిగించాలన్నారు. ప్రతి దరఖాస్తును ప్రాపర్‌గా ఎంక్వైరీ చేసి, రిపోర్టును ఆన్‌లైన్ అప్‌లోడ్ చేయాలని సీపీ సూచించారు. పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్ వాహనాలతో అధికారులు,సిబ్బంది ఎల్లప్పుడూ రోడ్లపై తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవటం చాలా ముఖ్యమన్నారు. పాయింట్ బుక్స్ చెక్ చేయాలని, కేడీ, డీసీ, సస్పెక్ట్‌షీట్స్ ఉన్న ఇండ్లను చెక్ చేయాలని పేర్కొన్నారు. రిసెప్షన్, ఎస్‌హెచ్‌వో, కమ్యూనిటీ పోలిసింగ్ ఇలా పోలీసు స్టేషన్‌కు సంబంధించిన అన్ని విభాగాల ఫంక్షనల్ వర్టికల్స్ గురించి, వాటి పనితీరు గురించి అడిగి తెలుసుకొని నిరంతరం ఎస్ఐ పర్యవేక్షణ చేయాలన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని, అప్పుడే సమాచారం వ్యవస్థ పటిష్టంగా ఉంటుందన్నారు. ఏదైనా నేరం జరిగినప్పుడు ఆపడానికి ప్రయత్నం చేసేలా, ఏదైనా సమస్య వస్తే దాని పరిష్కార మార్గం తెలిసి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరు తాము చేసే విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అధికారులకు సూచించారు. ఏదైనా సంఘటన జరిగినపుడు వేంటనే ఘటన స్థలానికి వెళ్లి పరిస్థితులు అదుపులో ఉండేలాగా చూడాలని పేర్కొన్నారు. ప్రతి వారం పోలీస్ స్టేషన్‌లో కోర్ట్ డ్యూటీఆఫీసర్స్‌తో సమావేశం ఏర్పాటు చేయాలని, కోర్టులో ట్రయిల్ నడిచే సమయంలో పోలీస్ అధికారులు నిందితులకు శిక్ష పడేలా నేర సంఘటనలో జరిగిన నిజం చెప్పేలా సాక్షులను మోటివేట్ చేయాలని సూచించారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని ముఖ్యమైన ప్రదేశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి(బ్లాక్ స్పాట్స్), ప్రమాదాలకు గల కారణాలను గుర్తించి, వాటి నివారణకై సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ల్యాండ్ కేసులు, సివిల్ కేసులలో ఎస్‌ఓపీ ప్రకారం పారదర్శకంగా ఇన్వెస్టిగేషన్ చేయాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు పాల్పడే వారిపై నిఘా ఉంచి ప్రతి 15రోజులకు ఒకసారి పిలిపించి మాట్లాడాలన్నారు. జీ2/సీసీసీ పిటిషన్లు పెండింగ్ లేకుండా త్వరగా పూర్తి చేయాలన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయాలతో పాటు రవాణాకు పాల్పడుతున్న వారిపై నజర్ పెట్టాలని, ముఖ్యంగా గంజాయి, నిషేధిత పొగాకు ఉత్పత్తులను అమ్మకాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు.

ఈ సమావేశంలో మంచిర్యాల డీసీపీ అశోక్ కుమార్, అడిషనల్ డీసీపీ (అడ్మిన్) సీ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, ట్రాఫిక్ ఏసీపీ నరసింహులు, మంచిర్యాల జోన్ సీఐలు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రామచందర్‌రావు, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ బుద్దె స్వామి, సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ మూర్తి లింగయ్య, ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ రావు, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సంజయ్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.







రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య


వినోద్ కుమార్ (ఫైల్)

ఓదెల, జూన్ 18: భార్య బంధువుల వేధింపులతో ఓ యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఓదెల మండలం కొలనూరులో వెలుగు చూసింది. మండలంలోని కొలనూర్ రైల్వే గేట్ సమీపంలో సోమవారం రాత్రి ఇదే గ్రామానికి చెందిన దున్నపోతుల వినోద్ కుమార్ (32) అనే యువకుడు దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తల్లి స్వరూప రామగుండం జీఆర్‌పి హెడ్ కానిస్టేబుల్‌కు మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వినోద్ కుమార్ భార్య వసంత బంధువులైన అమ్మమ్మ మాడక ఎంకమ్మ, నానమ్మ బొంతల కనకమ్మలు మానసికంగా వేధించడం వల్లనే నా కొడుకు ఆత్మహత్యకు పాల్ప డ్డాడని పేర్కొన్నారు. ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని, విచారణకు సహకరించకుంటే పొత్క పల్లి పోలీస్‌స్టేషన్‌కు కేసును అప్పగించ నున్నట్లు రామగుండం జి.ఆర్.పి. హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు. కరీంనగర్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న దున్నపోతుల రాజయ్యకు ఏకైక కుమారుడైన వినోద్‌కుమార్ ఆత్మహత్య చేసుకోవడంతో గ్రామంతో పాటు, కుటుంబంలో విషాదం నెలకొంది.

వృద్ధురాలి అదృశ్యం

ఎల్లారెడ్డిపేట, జూన్ 18: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన వృద్ధురాలు ఎనగందుల భూదవ్వ అదృశ్యంపై కేసు నమోదు చేశామని పోలీసులు మంగళవారం తెలిపారు. గ్రామంలోని వృద్ధురాలు భూదవ్వ ఈ నెల 17న మధ్యాహ్నం ముస్తాబాద్ మండలం ఆవునూరు గ్రామంలోని తన బంధువుల ఇంటికి వెళుతానని చెప్పి బయటకు పోయింది. అదే రోజు రాత్రి కుటుంబ సభ్యులు బంధువుల ఇంటికి ఫోన్ చేసి విషయం తెలుసుకున్నారు. తమ వద్దకు రాలేదని స్పష్టం చేయడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు బంధువుల వద్ద, చుట్టు పక్కల ఆరా తీశారు. ఆచూకీ లభించ లేదు. దాంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

విద్యుదాఘాతంతో గేదెల మృతి

జమ్మికుంట రూరల్, జూన్ 18: జమ్మికుంట మండలం తనుగుల గ్రామ శివారులో మంగళవారం విద్యుదాఘాతంతో రెండు పాడి గేదెలు మృత్యువాత పడ్డాయి. మూల ప్రభాకర్, పైడిపల్లి సంపత్‌లకు చెందిన రెండు గేదెలు తెగిపడిన విద్యుత్ వైర్లు తగిలి అక్కడికి అక్కడే మృత్యువాత పడ్డాయి.
















మహిళకు పురుడు పోసిన ఆర్టీసీ సిబ్బందికి మంత్రి పొన్నం అభినందన


ఆర్టీసీ సిబ్బందిని అభినందిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

భగత్‌నగర్, జూన్ 18: కరీంనగర్ బస్‌స్టేషన్‌లో ఆదివారం గర్భిణికి పురుడు పోసిన ఆర్టీసీ సిబ్బందిని మంగళవారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన గర్భిణి కుమారి తన భర్త జాలతో కలిసి ఆదివారం కుంట (భద్రాచలం) వెళ్లేందుకు ఆదివారం కరీంనగర్ బస్‌స్టేషన్‌కు వచ్చింది. కొద్దిసేపటికే కుమారికి పురిటి నొప్పులు రావడంతో ఆర్టీసీ సిబ్బంది సాయం కోరగా వెంటనే 108 సిబ్బందికి ఫోన్ చేశారు. పురిటి నొప్పులు ఎక్కువ కావటంతో ఆర్టీసీ మహిళా సిబ్బంది ప్లాట్‌ఫాం ఎదురుగా ఉన్న చెట్టు కిందకు కుమారిని తీసుకువెళ్లి చుట్టూ చీరలు కట్టి డెలివరీ చేశారు. పండంటి ఆడబిడ్డకు జన్మనివ్వగా 108 సిబ్బంది తల్లీబిడ్డను జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారు.

●పురిటి నొప్పులతో ఉన్న మహిళకు డెలివరీ చేసిన ఆర్టీసీ సిబ్బందిని మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్ సన్మానించారు. మహిళకు పురుడు పోసిన ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ సిబ్బంది సైదమ్మ, రేణుక, భవాని, లావణ్య, స్టేషన్ మేనేజర్ అంజయ్యలను రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌లు 5వేల నగదు అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.వినోద్‌కుమార్, రీజినల్ మేనేజర్ సుచరిత, డిప్యూటి రీజినల్ మేనేజర్లు భూపతిరెడ్డి, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మారుతీ.. వసతి ఏదీ..

- వేలాదిగా భక్తులు.. పదుల సంఖ్యలో అద్దె గదులు
- ఇబ్బందులు పడుతున్న భక్తులు
- కొండగట్టులో వెక్కిరిస్తున్న అసౌకర్యాలు

మల్యాల, జూన్ 18: ఉత్తర తెలంగాణలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న కొండగట్టు అంజనేయస్వామి దేవస్థానంలో సౌకర్యాల లేమి భక్తులను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. భక్తులు, దుకాణాల ద్వారా దేవస్థానానికి ఏటా సుమారు రూ.20కోట్ల వరకు ఆదాయం సమకూరుతున్నప్పటికీ కొండపైన కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ప్రభుత్వం, దేవాదాయ శాఖ అధికారులు, దేవస్థానం అభివృద్ధికి చర్యలు తీసుకోకపోవడంతో భక్తులకు ఇబ్బందిగా మారింది. కొండపై ముఖ్యంగా వసతి సౌకర్యం లేక తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. కొండగట్టుకు నిత్యం వేలాదిగా, శని, ఆది, మంగళవారాల్లో వేలాదిగా భక్తులు తరలివస్తుంటారు. అయితే కొండపై గదులు లేమి ఇబ్బంది మారింది.

● వేలల్లో భక్తులు.. పదుల్లో గదులు

కొండగట్టు అంజన్న దర్శనానికి నిత్యం వేలాదిగా భక్తులు వస్తున్నారు. ఇక ప్రతి మంగళ, శని, ఆదివారాల్లో దాదాపుగా ముప్పై వేల వరకు తరలివచ్చి స్వామి వారికి మొక్కులు తీర్చుకుంటారు. ఇందుకుగాను ముందు రోజే వేలాదిగా భక్తులు చేరుకుంటుండగా కొండపై వసతి లేకపోవడంతో ఆరుబయటే ఆలయ ఆవరణ తదితర చోట్ల చలిలో బసచేయాల్సిన పరిస్థితి నెలకొంది. వేలాదిగా వచ్చే భక్తుల కోసం కేవలం 47 వరకు మాత్రమే గదులు అందుబాటులో ఉండగా ఇందులో కొన్ని వ్యాపారుల ఆధీనంలో ఉండడంతో భక్తులకు వసతి లేమి తీవ్ర అసౌకర్యంగా మారింది. అంజనాద్రిలో 16, మారుతీ నిలయంలో 14, బుగ్గమఠం, సాగర్, శ్వేత కాటేజీలలో రెండు చొప్పున రూ.100 గదులు 7 ఉండగా వాటినే భక్తులకు ఇస్తున్నారు. కొండగట్టులో గదులు ఉండవనే ప్రచారం వేలాది మంది భక్తులు కొండగట్టుకు నేరుగా వచ్చి దర్శనం చేసుకొని వెలుతున్నారు. గదులు భక్తులకు తగిన రీతిలో ఉంటే వేలాదిగా వచ్చి స్వామి వారి మొక్కులు తీర్చుకునే అవకాశం ఉంది. గదులు లేకపోవడంతో సగం మొక్కుల చెల్లింపునకే పరిమితం అవుతున్నట్లు భక్తులు ఆవేదన చెందుతున్నారు.


కొండపైన గల ధర్మసత్రాలు


గదులు లేక బటయ పడుకున్న అంజన్న భక్తులు

● అధికారుల దృష్టికి తీసుకెళ్లాం - చంద్రశేఖర్, ఈవో

గదుల సంఖ్య తక్కువగా ఉండడంతో భక్తులకు అసౌకర్యం ఏర్పడుతోంది. 500గదుల నిర్మాణం కోసం ప్రయత్నిస్తున్నాం. గదుల లేమి విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. దాతలు కూడా గదుల నిర్మాణాలకు విరాళాలు అందించవచ్చు. భక్తులకు ఎలాంటి ఇక్కట్లు కలుగకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటూ పర్యవేక్షిస్తున్నాం. భక్తులకు సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటాం.

కొండగట్టులో భక్తుల రద్దీ

మల్యాల, జూన్ 18: కొండగట్టు ఆంజనేయస్వామి క్షేత్రం మంగళవారం భక్తులతో రద్దీగా మారింది. వేలాదిగా భక్తులు వేకువజాము నుంచే స్వామి వారిని దర్శించుకున్నారు. అంజన్న దర్శనం భక్తులు అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. ఆలయంలో అభిషేకాలు, వ్రతాలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఈవో చంద్రశేఖర, అధికారులు పర్యవేక్షించారు.

● అంజన్నను దర్శించుకున్న పోలీస్ అధికారులు

కొండగట్టు ఆంజనేయస్వామిని మంగళవారం కరీంనగర్ ఇంటిలిజెన్స్ ఎస్పీ రాజమహేంద్ర నాయక్, జగిత్యాల అడిషనల్ ఎస్పీ వినోద్ వేర్వేరుగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈవో చంద్రశేఖర్‌తో పాటు పోలీస్ అవుట్‌పోస్ట్ ఏఎస్సై చిలుక శ్రీనివాస్ ఉన్నారు

● నేడు బండి సంజయ్ రాక

కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పదవీ బాధ్యతలు చేపట్టాక బుధవారం మొదటి సారి కొండగట్టుకు వస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా తన గెలుపు కోసం అంజన్న సన్నిధిలో ముడుపు కట్టగా స్వామి వారి దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకుంటారని బీజేపీ నాయకులు తెలిపారు.

లారీ లోంచి జారిపడ్డ రాయి.. తప్పిన ప్రమాదం

శంకరపట్నం, జూన్ 18: శంకరపట్నం మండలం మొలంగూర్ ఎక్స్ రోడ్ వద్ద కరీంనగర్-వరంగల్ రహదారిపై ఓ గ్రానైట్ లారీ నుంచి బండరాయి జారి కింద పడింది. కొత్తగట్టు గ్రానైట్ క్వారీ నుంచి లారీలో గ్రానైట్ బండరాయిని కరీంనగర్ వైపుకు తీసుకెళ్తున్నారు. మొలంగూర్ ఎక్స్ రోడ్ వద్దకు రాగానే లారీ టైర్లు రోడ్డు కిందకు దిగాయి. నేల కుంగడంతో టైర్లు కొంత భాగం భూమిలోకి వెళ్లాయి. లారీ అటువైపు వంగడంతో బండరాయి జారి కింద పడింది. ఈ బండరాయి రోడ్డు పక్కన ఉన్న షాపు సమీపంలో పడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. లారీలో బండరాయి తరలించడానికి జాగ్రత్త చర్యలు చేపట్టకపోవడంతోనే జారి కింద పడిందన్నారు. గ్రానైట్ వాహనదారులు కనీస జాగ్రత్తలు పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని పేర్కొంటున్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.


కొత్తగట్టులో లారీలోంచి కింద పడ్డ గ్రానైట్ రాయి

సివిల్స్ కోచింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, జూన్18: ఉమ్మడి జిల్లాలోని డిగ్రీ పాసైన బీసీ, ఎస్సీ ,ఎస్టీ,ఈబీసీ అభ్యర్థులు సివిల్ సర్వీసెస్ ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని బీసీ స్టడీసర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ నెల 19 నుంచి జూలై3 వరకు వెబ్‌సైట్"www.tgbcstudycircle.cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తరగతులు జూలై18, 2024 నుంచి 2025, జూలై18 వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. మొత్తం 150 మంది అభ్యర్థులకు కోచింగ్ ఇవ్వనుండగా, అందులో 100 మందికి గాను జూలై 7న నిర్వహించే ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపిక చేస్తారన్నారు. మరో 50 మంది అభ్యర్థులను ఇంతకుముందు యూపీఎస్సీ ద్వారా నిర్వహించిన సివిల్ సర్వీసెస్ (ప్రిలిమ్స్)లో ఉత్తీర్ణత సాధించిన వారిని నేరుగా తీసుకుంటారని పేర్కొన్నారు. వారు సంబంధిత పత్రాలతో జూలై3లోగా బీసీ స్టడీ సర్కిల్ లక్ష్మీనగర్ కాలనీ, సైదాబాద్, హైదరాబాద్‌లో దరఖాస్తును సమర్పించాలని సూచించారు. ప్రవేశం పొందిన అభ్యర్థులకు లాడ్జింగ్, భోజన, రవాణా కోసం నెలకు రూ.5వేలు ఇస్తారన్నారు. గ్రంథాలయ సదుపాయం కూడా కల్పించినట్లు తెలిపారు. ఈ ఉచిత శిక్షణ హైదరాబాద్‌లో ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

పీఎం కిసాన్ సమ్మాన్ నిధితో రైతులకు మేలు

● కేంద్ర జలశక్తి, రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న

జమ్మికుంట, జూన్ 18: ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగు పెట్టుబడుల కోసం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి రైతులకు ఎంతగానో మేలు చేస్తుందని కేంద్ర జలశక్తి, రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రకాశం కృషి విజ్ఞాన కేంద్రం (కెవికె)లో భారత ప్రధాన మంత్రి నరేంద్రమోడి వారణాసిలో పిఎం కిసాన్ నిధి పథకం కింద 17వ విడుత నిధుల విడుదల ప్రారంభ కార్యక్రమాన్ని ప్రత్యేక్షంగా వీక్షించే విధంగా ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యతిథులుగా కేంద్ర మంత్రి, వ్యవసాయ సాంకేతిక అనుప్రయోగ పరిశోధన సంస్థ జోన్ అధికారి డాక్టర్ షేక్ ఎన్ మీరా, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర సహాయ మంత్రి సోమన్న మాటాడుతూ పంట పెట్టుబడి సాయం కింద దేశంలోని రైతులకు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ఈ పథకాన్ని 2019 ఫిబ్రవరిలో ఉత్తర్‌ప్రదేశ్ గోరఖ్‌పూర్‌లో ప్రధాన మంత్రి ప్రారంభించినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా మూడు విడుతల్లో రెండు వేల చొప్పున రూ.6వేలు రైతుల ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు. 17వ విడుతలతో భాగంగా తొమ్మిది కోట్ల 26లక్షల మంది రైతుల ఖాతాల్లో ఇరువై వేల కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. వ్యవసాయ పద్ధతుల్లో తోటి రైతులకు సహకరించడానికి పారా-ఎక్స్‌టెన్షన్ వర్కర్లుగా పని చేయడానికి కృషి సఖిలుగా శిక్షణ పొందిన 30వేల మందికి పైగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ప్రధాన మంత్రి మోదీ సర్టిఫికెట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ సాంకేతిక అనుప్రయోగ పరిశోధన సంస్థ జోన్ అధికారి డాక్టర్ షేక్ ఎన్ మీరా మాట్లాడుతూ ప్రపంచం, దేశంలో అత్యధికంగా 80శాతం చిన్న, సన్నకారు రైతులు ఉన్నారని, వారికి ఆర్థికంగా చేయూతను అందించేందుకు ఈ పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. వ్యవసాయంలో అగ్రి డ్రోన్ల మీద 85శాతం సబ్సిడీ ఇస్తున్నారని, అందులో మహిళలకు ప్రాధాన్యత ఇస్తూ శిక్షణ ఏర్పాటు చేస్తుందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడికౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ పీఎం కిసాన్ సమ్మాన్ నిధులను రైతులు పెట్టుబడిగా ఉపయోగించుకోవాలన్నారు. ఇటువంటి సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల ద్వారా తగిన శాస్త్రీయత సాంకేతిక సలహాలు పొందుతూ వ్యవసాయ రంగంలో రాణించాలని కోరారు. కెవికె ప్రధాన కార్యదర్శి పరిపాటి జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రైతులను రక్షించేందుకు, వారి కుటుంబాలకు భరోసా కల్పించేందుకు రైతు బీమాను కల్పించాలని కేంద్ర మంత్రిని కోరారు. ప్రస్తుతం వ్యవసాయంలో రైతులు నేల ఆరోగ్యంపై అధికంగా దృష్టి పెట్టాలని, నేల ఆరోగ్యమే మానవ మనుగడకు అవసరమని తెలిపారు. కెవికె సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్ వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద తెలంగాణ రాష్ట్రంలోని 29లక్షల 50వేల మంది రైతులకు రూ.590కోట్ల లబ్ధి చేకూరనుందని తెలిపారు. ఈ ఆర్థిక సహాయం ద్వారా వ్యవసాయానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసుకోవడానికి, ఆదాయం పెంచుకోవడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పమేల సత్పతి, హుజూరాబాద్ ఆర్డీవో, మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, జెడ్పీటీసీ డాక్టర్ శ్రీరామ్ శ్యామ్, కెవికె సిబ్బంది, ఆదర్శ రైతులు, వ్యవసాయ, అనుబంధ అధికారులు, రైతులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి సోమన్న

● కౌశిక్‌రెడ్డి ప్రసంగాన్ని అడ్డుకున్న బీజేపి నాయకులు

పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కార్యక్రమ ప్రారంభోత్సవ కార్యక్రమాకి హాజరైన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతుండగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించిన రైతుబంధు, రైతు బీమా, 24గంటల కరెంట్, కాళేశ్వరం ప్రాజెక్ట్, తదితర అంశాల ప్రస్తావన తీసుకువచ్చారు. జరుగుతున్న కార్యక్రమం గురించి మాట్లాడకుండా ఇతర అంశాల మీద మాట్లాడటంపై బీజేపీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి ప్రసంగాన్ని అడ్డుకున్నారు. కౌశిక్‌రెడ్డి సైతం వారి తీరుపై అసహనం వ్యక్తం చేశారు. స్వయంగా కేంద్ర మంత్రి స్పందించి బీజేపీ నాయకులకు నచ్చచెప్పే ప్రయత్నం చేయగా, వారు శాంతించడంతో గొడవ సద్దుమనిగింది.

ధర్మపురిలో ఘనంగా మహాలక్ష్మీ నృసింహ మహాయజ్ఞం

ధర్మపురి, జూన్ 18: ధర్మపురి క్షేత్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో అష్టోత్తరశత మహాలక్ష్మీ నృసింహ మహాయజ్ఞం మంగళవారం వైభవంగా నిర్వహించారు. లక్ష్మీ నరసింహ స్వామి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరంలాగే లోక కల్యాణార్థం, సమస్త విశ్వశాంతి కోసం హైదరాబాద్‌కు చెందిన శ్రీమాన్ భాగవతుల వంశీకృష్ణమాచార్య స్వామి ఆధ్వర్యంలో ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. నరసింహ స్వామి అనుబంధ ఆలయమైన శ్రీ ఉగ్ర నారసింహ స్వామి ఆలయంలో ఉదయం ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. అనేక మంది భక్తులు యజ్ఞంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, సీనియర్ అసిస్టెంట్ అలు వాల శ్రీనివాస్, కౌన్సిలర్ జక్కు పద్మ-రవీందర్ సిబ్బంది ఉన్నారు.


మహాయజ్ఞం నిర్వహిస్తున్న అర్చకులు

మాల్దీవ్స్‌లో నారాయణపూర్ వాసి మృతి

ఎల్లారెడ్డిపేట, జూన్ 18: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన శీతల చంద్రయ్య మాల్దీవ్స్‌లో ప్రమాదవశాత్తు ఈ నెల 17న మృతి చెందాడని కుటుంబ సభ్యులు, స్థానికులు మంగళవారం పేర్కొన్నారు. ఆయన మరణ వార్త తెలియడంతో కుటుంబంతో పాటు స్వగ్రామంలో విషాదం నెలకొంది. నెల రోజుల కిందట చంద్రయ్య సోదరుడు నర్సయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో మాల్దీవ్స్ నుంచి అంత్యక్రియలకు ఆయన స్వస్థలానికి చేరుకున్నాడు. 15 రోజుల పాటు ఇక్కడే ఉన్న చంద్రయ్య తిరిగి పయనమయ్యాడు. నెల రోజుల వ్యవధిలోనే ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు మృతి చెందడంతో కన్నీరుమున్నీరుగా రోధిస్తున్నారు. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం మేరకు.. గ్రామంలోని చంద్రయ్య ఉన్న ఊరిలో ఉపాధి లేక గత 20 ఏళ్లుగా ముంబాయికి వలస వెళ్లాడు. అక్కడ అఫ్గాన్ కంపెనీలో పనులు చేస్తు జీవిస్తుండేవాడు. ఈ క్రమంలో అదే కంపెనీ మాల్దీవ్స్ దేశంలో వంతెన నిర్మాణ పనులను చేపడుతోంది. దాంతో రెండేళ్ల కిందట చంద్రయ్య మాల్దీవ్స్‌కు వెళ్లాడు. నెల రోజుల కిందట అతని సోదరుడు నర్సయ్య అనారోగ్యంతో చనిపోయాడు. స్వగ్రామానికి వచ్చిన చంద్రయ్య అంత్యక్రియలు నిర్వహించి 15 రోజుల పాటు ఉండి తిరిగి పయనమయ్యాడు. ఈ నెల 17న వంతెన పనులు చేస్తున్న క్రమంలో రెండు క్రేన్ల మధ్య చిక్కుకుని చనిపోయాడని కంపెనీ ప్రతినిధులు మృతుడి భార్య పోశవ్వకు సెల్‌ఫోన్ ద్వారా మంగళవారం సమాచారం అందించారు. కుటుంబ పెద్ద మృతి చెందడంతో కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోధిస్తున్నారు. భారత ప్రభుత్వం స్పందించి మృతదేహాన్ని స్వగ్రామానికి పంపించేలా చర్యలు తీసుకోవడంతో పాటు తమను ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు.

మృతుడికి భార్య పోశవ్వ, వివాహమైన కూతురు భాగ్యలక్ష్మీ ఉన్నారు. కాగా బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచ్ దొమ్మాటి నర్సయ్య కోరారు.


చంద్రయ్య(ఫైల్)

నేరెళ్లలో ఘనంగా రేణుకా ఎల్లమ్మ బోనాలు

ధర్మపురి, జూన్ 18: ధర్మపురి మండలంలోని నేరెళ్ల గ్రామంలో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మ బోనాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు నెత్తి మీద బోనాలు పెట్టుకుని డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా ఆలయానికి వెళ్లారు. అనంతరం మహిళలు, రైతులు ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. మహిళలు అమ్మ వారలకు పసుపు, కుంకుమ చల్లి, బోనాలు పెట్టి నైవేద్యం సమర్పించారు. కుటుంబ సభ్యులు క్షేమంగా ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో నేరెళ్ల మున్నూరుకాపు సంఘం అధ్యక్షులు, న్యాయవాది జాజాల రమేష్, మాజీ ఉపసర్పంచ్ జాజాల శంకర్, ఉపాధ్యక్షులు పాదం చంద్రయ్య, జంగిలి తిరుపతి, కరవత్తుల నాగరాజు,జాజాల రవి ఉన్నారు.


గ్రామంలో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మ బోనాలు

రైలు కిందపడి ఆత్మహత్య

పెద్దపల్లి రూరల్, జూన్ 18 : మండలంలోని అందుగుల పల్లి రైల్వేగేటు వద్ద గ్రామానికి చెందిన దాడి రాజయ్య(44) గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సురేష్‌గౌడ్ తెలిపారు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో దాడి రాజన్న ఇబ్బంది పడుతున్నాడు. ఎన్ని ఆసుపత్రులు తిరిగినా నయం కాకపోవడంతో విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు జీఆర్‌పీ పోలీసులు తెలిపారు. మృతుడి భార్య అయిలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నామమాత్రపు రక్షణ చర్యలు

పెద్దపల్లి రూరల్, జూన్ 18 : మండలంలోని తుర్కల మద్దికుంట ఉర్దూ పాఠశాలకు అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో భాగంగా తాగునీటి సంపు నిర్మాణానికి నామమాత్రపు రక్షణ చర్యలు చేపట్టారు. నీటి సంపుకు పూర్తి నిర్మాణం చేపట్టి శాశ్వతంగా రక్షణ చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నామమాత్రంగా తడకలు, కర్రలు వేసి తాత్కాలికంగా ఏర్పాటు చేశారు.

'పాఠశాలపై చర్యలు తీసుకోవాలి'

కోల్‌సిటీటౌన్, జూన్ 18: గోదావరిఖనిలో క్రిస్టియన్ మిషనరీ ముసుగులో ఓ పాఠశాల యాజమాన్యం విద్యాదోపిడికి పాల్పడుతున్నదని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు యాసర్ల రాజ్‌కుమార్(తిమోతి) ఒక ప్రకటనలో ఆరోపించారు. విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

మిషన్ భగీరథ నీరు వద్దని వినతి

ముత్తారం, జూన్ 18 : మిషన్ భగీరథ పైపులైన్లలో కలుషిత నీరు వస్తోందని, అలాంటి నీరు తమకు వద్దని మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి సంతోష్‌కు మహిళలు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ మిషన్ భగీరథ పథకం ఏర్పాటు చేయకముందు గ్రామగ్రామాన ట్యాంకుల ద్వారా మానేరు నీరును అందించేవారని, ఎప్పటికప్పుడు ట్యాంకులను శుభ్రం చేస్తూ గ్రామ పంచాయతీ సిబ్బంది పర్యవేక్షణతో స్వచ్ఛమైన మానేరు నీరును అందించేవారన్నారు. ప్రస్తుతం మిషన్ భగీరథ ద్వారా అందిస్తున్న నీరు కలుషితమై వస్తోందని తమకు ఎప్పటిలాగే మానేరు నీరు అందించాలని వినతిపత్రంలో కోరినట్లు మహిళలు తెలిపారు. మానేరు నీరు అందించడం తమ పరిధిలో లేదని, సమస్యను జిల్లాస్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని, పైఅధికారుల సూచన మేరకు నీరందించడం జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి పేర్కొన్నట్లు మహిళలు తెలిపారు.

ధర్నాను విజయవంతం చేయాలి

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 18: కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌తో ఈనెల 24న కలెక్టరేట్ ఎదుట ధర్నాను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ కృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం యూనియన్ కార్యాలయంలో జరిగిన కాంట్రాక్టు కార్మికుల సమావేశంలో ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 20నుంచి 25 వరకు కార్మికుల సమస్యలపై కలెక్టరేట్ల ఎదుట ధర్నా చేయాలని పిలుపు మేరకు 24న పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయనున్నట్లు తెలిపారు. జీవో 22ను గెజిట్ చేసి సింగరేణి కార్మికులకు వర్తింపజేయాలని, చట్టబద్ధమైన హక్కులు, వసతులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి కాంట్రాక్టు కార్మికులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి అశోక్, నాయకులు బుచ్చమ్మ, శంకర్, లింగయ్య, దుర్గేష్ పాల్గొన్నారు.

గ్రామాల్లో జ్వరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

- జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత



గౌరెడ్డిపేటను సందర్శిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత

పెద్దపల్లి రూరల్, జూన్ 18 : జిల్లాలోని గ్రామాల్లో సీజనల్ వాధులు ప్రబల కుండా నియంత్రణ చర్యలు చేపట్టినట్లు జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత అన్నారు. మంగళవారం మండలంలోని గౌరెడ్డిపేట గ్రామంలో జ్వరాలు ప్రబలుతు న్నాయన్న విషయం దృష్టికి రావడంతో జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత గ్రామాన్ని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, మిషన్ భగీరథ సాంకేతిక నిపుణులతో కలిసి సందర్శించారు. గ్రామంలోని ప్రతి వీధిని పరిశీలించిన పంచాయతీ అధికారి కాలువలు, రోడ్ల శుభ్రత పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి రోజు సాయంత్రం 5 గంటల నుంచి కాల్వల దగ్గర ఫాగింగ్ చేయించాలని ఆమె పంచాయతీ కార్యదర్శికి ఆదేశించారు. గ్రామ ప్రజలంతా ప్రైవేట్ మినరల్ ప్లాంట్ నుంచి నీటిని తెచ్చుకొని తాగుతున్నారని తెలుసుకున్న పంచాయతీ అధికారి బృందం, సదరు ప్రైవేట్ మినరల్ ప్లాంట్‌ను పరిశీలించారు. ఆ నీటిని పరీక్షించగా అందులో లవణాల శాతం 50 శాతం మాత్రమే ఉండటంతో గ్రామ ప్రజలకు ఒళ్లనొప్పులు వస్తున్నా యని మిషన్ భగీరథ సాంకేతిక నిపుణులు తెలియజేశారు. ప్రైవేట్ వాటర్ ప్లాంట్ నీటిని తాగకూడదని గ్రామ ప్రజలకు వివరించారు. అనంతరం ప్రైవేట్ వాటర్ ప్లాంట్‌ను సీజ్ చేశారు. గ్రామ ప్రజలకు సరఫరా చేసే మిషన్ భగీరథ, బోర్ నీటిని పరిశీలించగా లవణాలు 200 శాతం పైగా ఉన్నట్లు గుర్తించామని, గ్రామ ప్రజలు మిషన్ భగీరథ నీటిని కాచి, చల్లార్చి తాగాలని పంచాయతీ అధికారి సూచించారు. గౌరెడ్డిపేట గ్రామంలో వైద్య సిబ్బందిచే మెడికల్ క్యాంపు నిర్వహించి తగు జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని డీపీవో పేర్కొన్నారు. ఈ పర్యటనలో జిల్లా పంచాయతీ అధికారి వెంట డివిజనల్ పంచాయతీ అధికారి వేణుగోపాల్, మండల పంచాయతీ అధికారి సుదర్శన్, ఎంపీడీవో శ్రీనివాస్ గౌడ్ , పంచాయితి కార్యదర్శి ప్రకాష్, వైద్యాధికారులు, మిషన్ భగీరథ సాంకేతిక నిపుణులు, తదితరులు పాల్గొన్నారు.

హత్యాచారానికి గురైన చిన్నారికి నివాళి

- నిందితుడిని కఠినంగా శిక్షించాలి - మహిళా కాంగ్రెస్, టీడీపీ నాయకుల డిమాండ్



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు, మహిళలు



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీడీపీ నాయకులు

కళ్యాణ్‌నగర్, జూన్ 18: సుల్తానాబాద్‌లో ఆరేళ్ల చిన్నారిని అత్యాచారం చేసి హత్య చేసిన నిందితున్ని కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ నాయకురాలు మనాలి ఠాకూర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం రాత్రి గోదావరిఖని చౌరస్తాలో చిన్నారికి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీహార్‌కు చెందిన వ్యక్తి ఆరేళ్ల చిన్నారి పై లైంగిక దాడికి పాల్పడి హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. నిందితున్ని ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా కఠినంగా శిక్షించాలని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. గంజాయి, డ్రగ్స్ మత్తులో యువత అక్రమమార్గంలో నడుస్తున్నారని, గంజాయిని అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాల్వ లింగ స్వామి, గడ్డం శ్రీనివాస్, బొంతల లచ్చన్న, కంకణాల రాజు, కంకణాల మౌనిక, బాదం వసంత, జ్యోతి, శోభ పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్, జూన్ 18: సుల్తానాబాద్‌లో చిన్నారి పై అఘాయిత్యం చేసి హత్య చేసిన కామాంధుడిని ఉరి తీయాలని డిమాండ్ చేస్తూ టీడీపీ ఆధ్వర్యంలో మంగళవారం గోదావరిఖనిలో కామాంధుడి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల ఏడుకొండలు మాట్లాడుతూ సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి రైస్ మిల్లులో పనిచేసే మహిళా కార్మికురాలి ఆరు సంవత్సరాల కూతురిపై అత్యాచారం చేసి హత్య చేసిన ఘటన బాధాకరమని పేర్కొన్నారు. నిందితుడిని వెంటనే అరెస్ట్ చేసి శిక్షించాలని, ఉరి శిక్ష విధించాలని, చిన్నారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముది గంటి దామోదర్‌రెడ్డి, చిటికెల రాజలింగం, పెగడపల్లి రాజనర్సు, నరెడ్డి స్వరాజ్యం, కళావతి, అశ్విని, సుందిళ్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్, జూన్ 18: సుల్తానాబాద్ ప్రాంతంలోని ఓ రైస్‌మిల్లులో అత్యాచారం హత్య చేయబడిన చిన్నారికి మానవ హక్కుల కమిటీ వారు ఘన నివాళులర్పించారు. సుల్తానాబాద్ ఐబీ చౌరస్తా వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్నారి చిత్ర పటం ముందు దీపాలు వెలిగించి మరో వైపు కొవ్వొత్తులతో నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మొగుళ్ల భద్రయ్య, జిల్లా అధ్యక్షుడు పూసాల కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట రాజయ్య, సాంబశివరావు, మండల కమిటీ అధ్యక్షుడు యూసఫ్, బూర్ల వంశీ, కమలాకర్, సదయ్యతో పాటు పలు మండల శాఖల అధ్యక్షుడు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు అదనపు కలెక్టర్ శుభాకాంక్షలు

పెద్దపల్లిటౌన్, జూన్ 18: నూతనంగా కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న కోయ శ్రీహర్షను మంగళవారం అదనపు కలెక్టర్ అరుణశ్రీ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో నెలకొన్న సమస్యలు, పరిస్థితులపై చర్చించారు.

కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలి

-కరీంనగర్ కార్గో మేనేజర్ సదాశివ్



పొత్కపల్లిలో ఆర్టీసీ కార్గో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మేనేజర్ సదాశివ్

ఓదెల, జూన్ 18: ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలని కరీంనగర్ కార్గో మేనేజర్ సదాశివ్ తెలిపారు. మండలంలోని పొత్కపల్లిలో మంగళవారం కరీంనగర్ మేనేజర్ సదాశివ్, ఎగ్జిక్యూటివ్ చంద్రమౌళితో కలిసి కార్గో కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ ఆర్టీసీ ఆధ్వర్యంలో పార్సిల్ కొరియర్ సర్వీస్ తెలంగాణతో పాటు ఆంధ్ర ప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలలో పాటు, పలు పట్టణాల్లో అందుబాటులో ఉందని తెలిపారు. అన్ని పట్టణాల్లో కొరియర్ కవర్లు తక్కువ ఛార్జీలతో రవాణా చేస్తున్నామని అన్నారు. సౌకర్యాన్ని పరిసర ప్రాంతాల ప్రజలు, వ్యాపారస్తులు వినియోగించుకోవాలని కోరారు. వివరాల కోసం 7981169996 నెంబర్‌కు ఫోన్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జొంగోని వెంకటేష్, రమేష్, శ్రీనివాస్, కొమరయ్య, మహేష్, రాజేష్, వినయ్, సాయి, నాగవర్మ, అభిలాష్, హరీష్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

'ఆధార్ కేంద్రాలను అదనంగా ఏర్పాటు చేయాలి'

రామగిరి, జూన్ 18: మండల కేంద్రంలో ఆధార్ కేంద్రాలను అదనంగా ఏర్పాటు చేయాలని మంగళవారం బీజేపీ మండల అధ్యక్షుడు మోల్గూమూరి శ్రీనివాస్ తహసీల్దార్ రాంచందర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఎక్కువ జనాభా కల్గిన మండలంలో ఒకే ఒక్క ఆధార్ సెంటర్ ఉండడం మూలంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఆధార్ సకాలంలో కాకపోవడంతో కమాన్‌పూర్, పెద్దపల్లి, గోదావరిఖనికి స్థానికులు వెళ్తున్నారని తెలిపారు. అదనంగా మరో రెండు ఆధార్ సెంటర్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తీగల శ్రీధర్, మెరుగు శ్రీకాంత్, కందుల రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ పీజీఈసెట్‌లో నిఖిల్‌కృష్ణకు 11వ ర్యాంకు



ముత్తారం, జూన్ 18: ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన దుబాసి మాధవి-రమేష్ పోలీస్ కానిస్టేబుల్ కుమారుడు దుబాసి నిఖిల్‌కృష్ణ టీఎస్‌పీజీఈసెట్‌లో స్టేట్ 11వ ర్యాంక్ సాధించాడు. నిఖిల్ కృష్ణ 2020 జేఈఈ మెయిన్స్‌లో ఉత్తీర్ణత సాధించి ఎన్ఐటీ ఆంధ్రప్రదేశ్ తాటిపల్లిగూడెం నందు బయోటెక్నాలజీ ఇంజనీరింగ్‌లో పట్టా పొందాడు. ఉన్నత చదువుల కోసం టీఎస్‌పీజీఈసెట్ రాసి ర్యాంకు సాధించాడు.

సెల్‌ఫోన్ అప్పగింత

రామగిరి, జూన్ 18: మండలంలోని సెంటినరీకాలనీకి చెందిన రామకృష్ణ అనే వ్యక్తికి చెందిన పోగొట్టుకున్న సెల్‌ఫోన్ కొండ్ర సుకుమార్‌కు లభించగా మంగళవారం ఎస్ఐ సందీప్‌కుమార్‌కు స్టేషన్‌లో అప్పగించారు. సెల్‌ఫోన్ పరిశీలించిన ఎస్ఐ రామకృష్ణదిగా గుర్తించి బాధితుడికి రిపోర్టర్ చేతుల మీదుగా పోలీస్‌స్టేషన్‌లో అందజేశారు. నిజా యితీగా సెల్‌ఫోన్‌ను అప్పగించిన రిపోర్టర్ సుకుమార్‌ను ఈ సందర్భంగా ఎస్ఐ అభినందించారు.

ప్రమాదకరంగా ఎస్సారెస్పీ బ్రిడ్జి

-పట్టించుకోని అధికారులు



కూలిన బ్రిడ్జి సైడ్ వాల్

పెద్దపల్లి రూరల్, జూన్ 18: పెద్దపల్లి మండలంలోని తుర్కలమద్దికుంట గ్రామానికి అనుబంధ గ్రామమైన గొళ్లపల్లి, నిట్టూరుకు వెళ్లే దారిలో ఉన్న ఎస్సారెస్పీ డి-83 కెనాల్‌పై నుండి ఉన్న బ్రిడ్జి ప్రమాదకరంగా తయారైంది. చాలా ఏళ్ల క్రితం నిర్మించిన బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. నిరంతరం ఈ బ్రిడ్జిపై నుంచి ధాన్యం రవాణా చేసే లారీలు వెళ్తాయి. వ్యవసాయ సాగు సమయంలో ట్రాక్టర్లు, కేజ్‌వీల్స్ వాహనాలు అధికంగా రాకపోకలు సాగిస్తాయి. దీంతో బ్రిడ్జి సైడ్‌వాల్‌లు ఇప్పటికే కూలిపోగా రాకపోకల సమయంలో బ్రిడ్జి కదలికలు ఏర్పడుతున్నాయి. ఎప్పుడేం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ బ్రిడ్జికి నష్టం వాటిల్లినట్లయితే నిట్టూరు, గొళ్లపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం ఉంది. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఆర్డీవో



ధరణి దరఖాస్తులపై చర్చిస్తున్న ఆర్డీవో

రామగిరి, జూన్ 18: మండల తహసీల్దార్ కార్యాలయాన్ని మంథని ఆర్డీవో హనుమానాయక్ మంగళవారం సందర్శించారు. రెవెన్యూ పరమైన పలు అంశాలపై ఆర్డీవో చర్చించారు. ముఖ్యంగా ధరణి, ప్రజావాణి దరఖాస్తుల పెండింగ్ సత్వరం పంపించాలని సూచించారు. దీంతో పాటు గ్రామాల్లోని కూలీలకు సంబంధించిన లేబర్‌కార్డుల దరఖాస్తులను తక్షణం పంపించాల్సిందిగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాంచందర్ రావు, ఆర్ఐ నిహారిక, సిబ్బంది పాల్గొన్నారు.

రేపాకలో ప్రాచీన శిల్పకళా సంపద

ఇల్లంతకుంట, జూన్ 18: రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంటు మండలంలోని రేపాక గ్రామంలోని చౌడమ్మగుండుపై ప్రాచీన శిల్పకళా సంపద వెలుగులోకి వచ్చింది. కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. ఇల్లంతకుంట మండలం రేపాకలోని చౌడమ్మగుండుపై 10వ శతాబ్దానికి చెందిన అర్ధశిల్పాల దృశ్య కావ్యం చెక్కిఉంది. శిల్పంలో అశ్వారూఢుడైన ఒక వీరుడు అడివిపందిని బల్లెంతో పొడుస్తున్నట్లు కనిపిస్తుంది. అతడి వెనకాల రాజచత్రంతో మావటీడు ఏనుగుతో కనిపిస్తున్నాడు. దీనిని బట్టి పూర్వపు రాజులు మృగయావినోదం జరిపినట్లు గోచరిస్తుందని పేర్కొన్నారు. గతంలో నర్మెటలో లభించిన వీరగల్లులా ఇక్కడ కూడా ఉన్నట్లు పేర్కొన్నారు. ఇక్కడ లభించిన శిల్పకళా సంపద వివరాలను కొత్తతెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ దృష్టికి తీసుకెళ్లినట్లు సభ్యులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో చరిత్రబృందం సభ్యులు కెవిజికె ఆచార్య, వేములవాడ హరీష్, ఉదయ్‌కిరణ్, కూన సంతోష్, కూన శ్రీనివాస్, బిళ్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రాజమల్లుకు బంగారు నంది అవార్డు

సిరిసిల్ల టౌన్, జూన్ 18: సిరిసిల్ల పట్టణానికి చెందిన బైరి రాజమల్లుకు మంగళవారం హైదరాబాద్ రవీంద్రభారతి కళా వేదికలో తెలంగాణ మ్యారేజ్‌బ్యూరో అసోసియేషన్ జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బంగారు నంది అవార్డును అందజేశారు. రాజమల్లు 2023-24 సంవత్సరానికి ఐదు వివాహాలు చేయించడంతో జేఏసీ ఆధ్వర్యంలో సన్మానించారు.

బద్ది పోచమ్మకు మొక్కులు



ఆలయం వద్ద భక్తుల సందడి

వేములవాడ టౌన్, జూన్ 18 : వేములవాడ దేవస్థానం అనుబంధంగా ఉన్న బద్దిపోచమ్మ ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. మట్టి కుండలలో అమ్మవారికి నైవేద్యం వండి శివసత్తుల నృత్యాలతో అమ్మవారి ఆలయానికి చేరుకుని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులు గంట పాటు నెత్తిన బోనాలతో క్యూలైన్‌లో బారులుదీరారు. అనంతరం అమ్మవారిని దర్శించుకొని తరించారు.



డ్రైవింగ్ పరీక్షను ప్రారంభించిన జీఎం



ఈపీ ఆపరేటర్ నైపుణ్య పరీక్షలను ప్రారంభిస్తున్న జీఎం సుధాకర్‌రావు

రామగిరి, జూన్ 18: సింగరేణి ఆర్జీ-3 డివిజన్ సెంటినరీకాలనీలో ఈపీ ఆపరేటర్ ట్రైనీ డ్రైవింగ్ పరీక్షను మంగళవారం ప్రారంభించారు. రాణి రుద్రమాదేవి క్రీడాప్రాంగణంలో రెండు రోజుల పాటు నిర్వహించే ఈపీ ఆపరేటర్ ట్రైనీ డ్రైవింగ్ నైపుణ్యతా పరీక్ష ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై పచ్చజెండాను ఊపి ప్రారంభించారు. ఈ పరీక్షలో ఆర్జీ-2,3, అడ్రియాల లాంగ్ వాల్‌కు చెందిన ఉద్యోగులు పాల్గొనన్నారు. ఇందులో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు ఈనెల 30న రాత పరీక్షకు హాజరుకావాలని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు రఘుపతి, విలాస్ శ్రీనివాస్‌పొద్దార్, శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, మారుతి, శ్రీహరి, సునీల్, ప్రసాద్, వేణుగోపాల్, సత్యనారాయణ, లింగమూర్తి, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

113 మందికి సర్ఫేస్ జనరల్ మజ్దూర్‌గా అవకాశం

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 18: వకీల్‌పల్లె గనికి చెందిన 113 మంది జనరల్ మజ్దూర్‌లకు సర్ఫేస్‌లో అవకాశం కల్పిస్తూ యాజమాన్యం ఆర్డర్స్ జారీ చేసినట్లు ఏఐటీయూసీ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ప్రకాష్ తెలిపారు. మంగళవారం వీకేపీ గనిలో ఆర్డర్స్ తీసుకున్న కార్మికులను కలసి మాట్లాడారు. 236సర్ఫేస్ జనరల్ మజ్దూర్ ఖాళీలు ఉండగా, ఫిబ్రవరిలో 100 మందికి యాజమాన్యం ఆర్డర్స్ ఇచ్చినట్టు తెలిపారు. రెండవ లిస్ట్‌లో 113మందికి సర్ఫేస్ జనరల్ మజ్దూర్‌లుగా మూడు నెలల క్రితం ఇవ్వాల్సి ఉండగా ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆలస్యం జరిగినట్టు తెలిపారు. సీనియార్టీ ప్రకారం పూర్తి పారదర్శకంగా ఆర్డర్స్ ఇప్పించడంలో ఏఐటీయూసీ కృషి ఉన్నదని ప్రకాష్ తెలిపారు. ప్రకాష్ వెంట అన్నారావు, మహేందర్, సంపత్, విజయ్, అశోక్, నాగరాజు ఉన్నారు.

కష్టపడే సంస్కృతి మెరుగుపడాలి..

సీఎండీ బలరాం

గోదావరిఖని, జూన్ 18: డ్యూటీలకు రాకుండా మస్టర్లు పడడం, అటెండెన్స్ పడి ఆఫీస్ వదిలివెళ్లడం, సమయపాలన పాటించకపోవడం.. ఇలా వ్యవహరించే కార్మికులు, ఉద్యోగుల ఆటలు ఇక సింగరేణిలో చెల్లవు..ఉత్పత్తి, ఉత్పాదకతలు మెరుగుపడాలంటే యంత్రాలకు కాకుండా మనుషులకు కూడా క్రమశిక్షణ ఉండాలని గ్రహించిన సీఎండీ బలరాంనాయక్ ఇక దొంగ మస్టర్‌గాళ్లను వదిలిపెట్టేది లేదని హెచ్చరిక చేశారు.ఇందులో కార్మికులకు, ఉద్యోగులకు, అధికారులకు ఎవరికి మినహాయింపు లేదని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. కంపెనీ మనుగడ సాధించాలంటే పని సంస్కృతి మరింత మెరుగుపడాలని సీఎండీ స్పష్టం చేశారు. మంగళవారం సింగరేణి భవన్ నుంచి సీఎండీ ఈ అంశంపై ప్రకటన విడుదల చేశారు. కంపెనీలో పని సంస్కృతి పెంచేందుకు కీలక చర్యలకు పూనుకున్నారు. కార్యాలయాల్లో అధికారులు, ఉద్యోగుల సమయపాలనపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. గనులు, కార్యాలయాల్లో పనిచేస్తున్న కొందరు విధులకు రాకున్నా మస్టర్లు పడుతున్నట్టు, మరికొందరు మస్టర్ పడి బయటకు వెళుతున్నట్టు నిఘా వర్గాల ద్వారా తెలుసుకుని సీరియస్‌గా స్పందించారు. అలాగే భూగర్భ గనుల్లో పని ప్రదేశాలను సంబంధిత అధికారులు రోజూ తనిఖీ చేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సింగరేణి ఉద్యోగులు, అధికారులందరూ ఇకపై రోజూ తప్పనిసరిగా బయోమెట్రిక్ అటెండెన్స్ నమోదుచేసుకోవాలని, దీనిపై ఆయా ఏరియాల జీఎంలు, విభాగాధిపతులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. భోజన విరామం పూర్తయిన తరువాత నిర్ణీత సమయంలో ఎవరి సీట్లలో వారు కూర్చొని పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని జీఎంలకు సూచించారు. లంచ్ బ్రేక్‌లో చాలా మంది 3గంటలపాటు విరామం తీసుకోవడం వల్ల ఫైళ్లు అన్ని పెండింగ్‌లో ఉంటున్నాయని సెక్యూరిటీ విభాగం నివేదికలు తెప్పించుకున్న సీఎండీ ఈఅంశంపై కూడా సీరియస్ అయ్యారు. ఆసుపత్రుల్లో, డిస్పెన్సరీలలో సిబ్బంది సకాలంలో విధులకు హాజరుకాని విషయంలో గతంలో మెమోలు జారీ చేసిన సీఎండీ ఇకపై అలా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆ ప్రకటనలో హెచ్చరించారు. డ్యూటీలోకి వచ్చిన తరువాత బయటకు వెళ్లడం, పని చేయకుండా కూర్చోవడం, నాణ్యమైన పని చేయకపోవడం వంటి ఉదాసీనతలు ఇకపై ఉంటే ఎంతటి వారిపైననైనా వేటు వేయాల్సి ఉంటుందన్నారు. బొగ్గు ఉత్పత్తి చేస్తున్న కార్మికులు 8గంటలు కష్టపడి పనిచేస్తుంటే వారికి సంబంధించిన సంక్షేమం, ఇతరాత్ర పనులు నిర్వహించే ఉద్యోగులు, అధికారులు అంతకంటే బాధ్యతయుతంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు కొందరు ఏదో కారణం చూపి ఆఫీస్ వదిలి వరండాల్లో తిరగడం, బయటకు వెళ్లడం, కబుర్లతో కాలక్షేపం చేయడంలాంటి వారిపై విభాగాధిపతులు చర్యలు తీసుకోకపోతే వారిపైనే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. క్రమశిక్షణ గల సంస్థగా సింగరేణి రూపుదిద్దడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్పొరేట్ కార్యాలయంలో 32మంది ఆలస్యంగా రావడంతో సెక్యూరిటీ విభాగం ఆ వివారాలను రికార్డు చేశారు. ఆయా శాఖలకు ఈ వివారాలను పంపించారు. దీనిపై ఆయా శాఖల విభాగాల అధిపతులను సీఎండీ మందలించారు. ఈ అంశంపై సింగరేణి వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు కూడా ఉంటాయని సీఎండీ హెచ్చరించారు.

సంస్థలో మితిమీరుతున్న రాజకీయ జోక్యం..

- ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య



సమావేశంలో మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

రామగిరి, జూన్ 18: సింగరేణి రాజకీయ జోక్యం మితిమీరుతోందని, దాని నివారణ చర్యలు చేపట్టాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య అన్నారు. మంగళవారం సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2లో ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన బకాయిలను సత్వరం చెల్లింపు చేపట్టాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో స్ట్రక్చర్ కమిటీ సమావేశాల నిర్వహణకు సంఘాలు ముందుకు రావాలని కోరారు. కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కార మార్గం స్ట్రక్చర్ సమావేశాలతోనే సాధ్యమని పేర్కొన్నారు. కోల్‌ఇండియా మాదిరిగా హక్కులను సాధించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. స్వంత ఇంటి పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈపీ ఆపరేటర్‌లకు గ్రేడ్ల ప్రమోషన్ల విషయంలో డిటుబి గ్రేడ్ల ఖాళీలతో సంబంధం లేకుండా కల్పించాలని కోరారు. కార్మికులకు అండగా ఉంటూనే నూతన గనుల ఏర్పాటుకు కృషి చేయాల్సిన అవసరంఉందన్నారు. ఈ సమావేశంలో నాయకులు జూపాక రాంచందర్, ఎంఆర్‌సీ రెడ్డి, స్వామి, గంగాధర్, అరమకొండా పోచం, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

పెద్దపల్లిటౌన్, జూన్ 18: జిల్లాలోని సంగీత సినిమా థియేటర్‌లో అగ్ని ప్రమాదాల నివారణ, ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించినట్లు ఫైర్ ఆఫీసర్ దేవనంది శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం అగ్నిమాపక శాఖ సంచాలకుల ఆదేశాల మేరకు పెద్దపల్లి పట్టణంలోని సంగీత సినిమా థియేటర్‌లో తనిఖీ నిర్వహించి అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. థియేటర్‌లో ఉన్న అగ్నిమాపక సాధనాలను పరీక్షించి అవి పనిచేయు విధానాన్ని సిబ్బందికి వివరించారు.

విద్యుత్‌తో ప్రమాదాలు, థియేటర్‌లో పొగ తాగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అగ్ని ప్రమాదం సంభవించినచో సిబ్బంది ఎలా స్పందించాలో ప్రదర్శించారు. ఇసుక బకెట్‌లలో 6 నెలలకు ఒకసారి పొడి ఇసుకను మార్చాలని సూచించారు. ఫైర్ హైడ్రేంట్స్‌కు సరిపడు నీరు ఉండేలా చూసుకోవాలని స్టేషన్ ఫైర్ ఆఫీసర్ తెలిపారు.

'ఎరువుల దుకాణాలపై చర్య తీసుకోవాలి'

పెద్దపల్లిటౌన్, జూన్ 18: అధిక ధరలకు ఎరువులు, విత్తనాలు అమ్ముతున్న దుకాణాలపై చర్యలు తీసుకోవాలని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో మంగళ వారం కలెక్టర్ కార్యాలయంలో ఏఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ పెద్దపల్లి ఏరియా కార్యదర్శి సీపెల్లి రవీందర్ మాట్లాడుతూ పెద్దపల్లి, సుల్తానాబాద్ కేంద్రాలలో ఉన్న ఎరువులు, విత్తనాల యజమానులు ధనార్జనే ధ్యేయంగా ఎరువులు, విత్తనాలు బ్లాక్ మార్కెట్‌కు తరలించి అధిక ధరలకు అమ్ముతూ రైతులను మోసం చేస్తున్నా రన్నారు. నకిలీ విత్తనాలు మార్కెట్లో విచ్చలవిడిగా అమ్ముతున్నారని ఆరోపించారు. పలు ఎరువుల దుకాణం యజమానులు నకిలీ విత్తనాలు విక్ర యిస్తూ అధిక లాభం పొందుతున్నారన్నారు. వెంటనే ఎరువులు, విత్తనాల దుకాణాలపై విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టి అక్రమ వ్యాపారాలను నియంత్రించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడుతామని ఆయన ఈసందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కల్లెపల్లి అశోక్, జిల్లాల ప్రశాంత్, రాంచరణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.